ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక

మంగళవారం 22-4-2025




# మహేష్ బాబుకు ఈడీ నోటీసులు

## సురానా , సాయిసూర్య డెవలపర్స్ మనీ ల్యాండరింగ్ కేసులో నోటీసులు

## కంపెనీలకు ప్రమోషన్ చేసిన సూపర్ స్టార్

టాలీవుడ్ లో ఇటీవల వరుస సంఘటనలు ఇండస్ట్రీని కుదిపేస్తున్నాయి.. సంధ్య థియేటర్ ఘటనలో .. అల్లు అర్జున్... బెయిల్ తీసుకున్నారు. అలాగే బెట్టింగ్ యాప్ ప్రమోషన్స్ విషయంలో బడా సినీ తారలు, నటులు.. పోలీసులు కేసు ఎదుర్కొన్నారు. ఇప్పుడు ప్రయోషన్ చేసినందుకు మహేష్ ఈడీ నోటీసులు తీసుకొన్నారు



హైదరాబాద్ : టాలీవుడ్ ఇండస్ట్రీలో సంచలనం చోటుచేసుకుంది. తాజాగా సూపర్ స్టార్ మహేష్ బాబు ఈడీ అధికారులు నోటీసులు జారీ చేశారు. సోమవారం ఉదయం 10.30కి విచారణకు హాజరు కావాలని ఆ నోటీసులలో పేర్కొన్నారు. సురానా , సాయిసూర్య డెవలపర్స్ మనీ ల్యాండరింగ్ కేసులో ఆయనకు నోటీసులు జారీ అయ్యాయి. అయితే, మహేష్ బాబు (Mahesh Babu) ఆ రెండు కంపెనీలకు ప్రమోషన్స్ చేసేందుకు గాను చెక్కు రూపంలో రూ.3.4 కోట్ల, లిక్విడ్ క్యాష్ రూ.2.5 కోట్లు అంటే మొత్తం రూ.5.90 కోట్ల పారితోషికం తీసుకున్నట్లుగా ఈడీ అధికారులు గుర్తించారు. మనీ ల్యాండరింగ్‌కు పాల్పడిన కంపెనీల్లో పెట్టుబడులు పెట్టేందుకు ఆయన ప్రజలను ఇన్‌ఫ్లుయెన్స్ చేశారనే అభియోగంపై ఆయనకు ఈడీ నోటీసులు జారీ చేసినట్లుగా తెలుస్తోంది.

### ఇటీవల ఆ కంపెనీల్లో ఈడీ సోదాలు

ఇటీవలే ఈడీ అధికారులు సురానా, సాయి సూర్య డెవలపర్స్ సంస్థలపై దాడులు చేశారు. సోదాల్లో భాగంగా సికింద్రాబాద్ బోయిన్‌పల్లిలోని సురానా ఇండస్ట్రీస్ ఎండీ నరేంద్ర సురానా ఇంట్లో భారీగా నగదు పట్టుబడింది. సురానా ఇండస్ట్రీస్ అనుబంధ కంపెనీ, సాయి సూర్య డెవలపర్స్ సంస్థ ఎండీ సతీశ్ చంద్రగుప్త ఇంట్లో కూడా భారీగా నగదును సీజ్ చేశారు. సాయి సూర్య, సురానా కార్యాలయాల్లో పలు డాక్యుమెంట్స్ కూడా స్వాధీనం చేసుకున్నారు. కొన్ని రోజుల క్రితమే సాయిసూర్య డెవలపర్స్‌కు చెందిన సతీశ్‌ను సైబరాబాద్ పోలీసులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. వట్టి నాగులపల్లిలో వెంచర్ పేరుతో డబ్బులు వసూలు చేసి సతీశ్ (Sathish) మోసం చేశారని బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సైబరాబాద్ పోలీసుల కేసు ఆధారంగా సాయిసూర్య డెవలపర్స్ పై ఈడీ విచారణ చేపట్టింది.

### నిధుల బదిలీ ఇలా

సురానా సంస్థ పలు షెల్ కంపెనీ లను ఏర్పాటు చేసి అక్రమ లావాదేవీలకు పాల్పడినట్లు ఈడీ గుర్తించింది. బ్యాంకులో నుంచి తీసుకున్న రుణంతో షెల్ కంపెనీలకు నిధుల బదిలీలు చేసినట్లుగా విచారణలో తేలింది. ఆ మొత్తాన్ని పెద్ద మొత్తంలో రియల్ ఎస్టేట్ సంస్థల్లో పెట్టుబడులు పెట్టినట్లు అధికారులు తేల్చారు. ఈ వ్యవహారంపై ఈడీ మరింత లోతుగా విచారణ జరిపింది. కాగా, సురానా గ్రూప్‌కు అనుబంధంగా పనిచేస్తున్న సాయిసూర్య డెవలపర్స్ హైదరాబాద్‌లో పలు కంపెనీలకు అక్రమంగా భూములను అమ్మినట్లు తేలడంతో తనిఖీలు చేశారు. మరోవైపు మైనింగ్, కాపర్, సోలార్ వ్యాపారాల్లో ఉన్న సురానా గ్రూప్స్ పెద్ద ఎత్తున మనీలాండరింగ్‌కు పాల్పడినట్లు గుర్తించి, ఈడీ దాడులు చేసింది.

ఈ రెండు సంస్థలు చెన్నై ఎస్‌బీఐ నుంచి రూ.వేల కోట్లు రుణాలు తీసుకున్నారు. అయితే, తిరిగి చెల్లించకపోతుండడంతో 2012లో సురానా గ్రూప్‌పై సీబీఐ కేసు నమోదు చేసింది. అదేవిధంగా తనిఖీల సమయంలో వారి వద్ద నుంచి అక్రమంగా నిల్వ ఉంచిన 400 కేజీల బంగారం సీబీఐ స్వాధీనం చేసుకుంది. ఈ క్రమంలోనే తాజాగా ఆ రెండు కంపెనీలకు ప్రమెషన్ చేసిన సూపర్ స్టార్ మహేశ్ బాబుకు ఈడీ అధికారులు నోటీసులు ఇవ్వడం హాట్ టాపిక్‌గా మారింది.